క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జోగులు



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని, మండలంలోని తాటిపాడు గ్రామంలో ముస్లిం మతపెద్దలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ఆ గ్రామానికి చేరుకున్న ఆయన అక్కడి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు ఆరగించి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, సంకిలి పీఏసీఎస్ డైరెక్టర్ రామినాయుడు, మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ కృష్ణవేణి, ముస్లిం సోదరులు షేక్ సలీం మదీన్, షేక్ మహ్మద్ షా, ఖాన్‌పటాన్ దావుద్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పీఏసీఎస్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌గా బొమ్మి అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆయనకు అభినందనలు తెలిపి, రైతులకు నిత్యం అందుబాటులో ఉండి, సేవలందించాలని కోరారు. పీఏసీఎస్ లావాదేవీలు పెంచేందుకు సిబ్బంది, రైతుల మధ్య అవగాహన ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సబ్‌డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి జి.రామకృష్ణ, కార్యదర్శి తమ్మినాయుడు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైకేపీ ఏసీకి సత్కారం

రాజాం: వైఎస్సార్ క్రాంతి పథంలో శతశాతం లక్ష్యాలు సాధించినందుకు గాను రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవిని జిల్లా అధికారులు సత్కరించారు. ఇదే విషయమై స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన 2022–23 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయించడంతో పాటు సకాలంలో అప్పుల వసూళ్లు జరిపించడంలో కృషికి గాను తనను జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి అభినందించి, మెమెంటో అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం రూ.36.36 కోట్ల స్త్రీనిధి రుణాల లక్ష్యం కాగా, రూ.30.63 కోట్లు మంజూరు చేసి, లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు.

మల్లంపేటలో పండగ సందడి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటలో ఈ నెల 24వ తేదీ నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో పండగ సందడి నెలకొంది. గురువారం బంగారమ్మ తల్లి వారాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

వంగర ఎస్‌ఐగా జనార్దనరావు



వంగర: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఆర్.జనార్దనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: మండలంలోని లక్ష్మీపేటకు చెందిన లోపింటి నాగమణికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 వేల తక్షణసాయాన్ని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ చేతులమీదుగా గురువారం అందజేశారు. ఇటీవల ఆమె భర్త శంబరి మృతి చెందడంతో బీమా కింద ప్రస్తుతం తక్షణ సాయం, ఆ తర్వాత పూర్తి మొత్తం అందజేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉత్తరావెల్లి గణేష్ బెనర్జీ, పంచాయతీ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఈ నెల 22వ తేదీన మండల పరిధిలోని బొద్దాంలో జరగనున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సంబంధించి, గ్రామంలో నిర్వహించే సభకు సిద్ధం చేస్తున్న స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం గ్రామగ్రామాన జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రతీ ఇంటికి ప్రభుత్వం ద్వారా కలుగుతున్న మేలును వివరించడమేనన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలంతా కార్యక్రమ లక్ష్యానికి కృషి చేయాలని కోరారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ ఆదరణ

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు జనం ఘనస్వాగతం పలుకుతున్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లోనూ జగనన్న సర్కారును ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



రాజాం: కంచరాంలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ రాంబాబు, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు



రేగిడి: కొర్లవలసలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ హరినాథ్



రేగిడి: కొర్లవలసలో సీఎం జగన్ మళ్లీ సీఎం కావాలని నినదిస్తున్న గ్రామస్తులు



బొబ్బిలి: పట్టణంలోని నాలుగో వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకురాలు రాణి



తెర్లాం: పెరుమాళిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ హేమలత, గృహసారథులు, వలంటీర్లు



బొబ్బిలి: పట్టణంలోని మూడో వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ ప్రచారం



సంతకవిటి: ఎస్.రంగారాయపురంలో ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న ఎంపీటీసీ



రాజాం సిటీ: బొద్దాంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ తవిటమ్మ



రామభద్రపురంలోని కనిమెరక వీధిలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మండాకురిటిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని మండాకురిటి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్ని పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ఆయన తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామానికే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు నెరవేర్చడంతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ప్రజలకు ఇచ్చిన మరెన్నో హామీలను ఆయన నెరవేర్చారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటికి ఎల్లోమీడియా అండగా నిలుస్తోందని విమర్శించారు. రాష్ట్ర జనమంతా జగనన్న వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనే తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు, ఎంపీటీసీ బత్తుల కుమారి, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ డోల తిరుపతి, సర్పంచ్‌లు డోల తిరుపతి, మొయ్యి మోహనరావు, బోనెల ప్రసాదరావు, గురువు సింహాచలం, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



మట్టినమూనాల సేకరణలో వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రేగిడి: భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని, నేల ఏ రకమని తెలిస్తే ఆ రకానికి తగ్గట్టు పంటలు వేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కోడిశ గ్రామంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు, నేలసారవంతం, పంటలు వేయడం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయిమణికంఠ పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో హద్దురాళ్ల ఏర్పాటు



రామభద్రపురం: హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

రామభద్రపురం: భూముల రీసర్వేలో భాగంగా చేస్తున్న హద్దురాళ్ల ఏర్పాటు రైతుల సమక్షంలో చేయాలని తహసీల్దార్ సుబ్బారావు సూచించారు. గురువారం మండలంలోని కొండపాలవలస గ్రామంలో చేస్తున్న హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలించిన ఆయన భూముల రీసర్వేతో ఎన్నో ఏళ్ల నాటి భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. రైతులు ఉన్నప్పుడే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరిగితే ఇంకెప్పుడూ భూ సమస్యలు రావన్నారు. పాతిన రాళ్లను ఎవరైనా పీకేస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భానుప్రకాష్, వీఆర్‌ఓ ఉదయ్ పాల్గొన్నారు.

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని గొలుగువలసలో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటును మండల డిప్యూటీ తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల మధ్య ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో భూముల రీసర్వే, సరిహద్దుల గుర్తింపు, హద్దుల గుర్తింపు పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గులివిందల శంకరరావు పాల్గొన్నారు.



తెర్లాం: గొలుగువలసలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ

నేడు లోతుగెడ్డలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తివిక్రమ్ ఓ ప్రకటనలో గురువారం ప్రకటించారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



వీరసాగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: మండలంలోని వీరసాగరం, ముగడ గ్రామాల్లో నవధాన్యాల సాగుపై గురువారం అగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ రైతు నవధాన్యాలు సాగు చేసుకోవాలని కోరారు. నవధాన్యాల సాగుతో నేల సారవంతమై, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం ఖరీఫ్–2024 ప్రణాళిక తయారీపై సమావేశం నిర్వహించి, పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మరిపి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



లక్ష్మీపురంలో కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జేఈ శ్రీచరణ్

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, ప్రజావినియోగంలోకి తీసుకురావాలన్నారు.

నేడు భాగవత సారాంశ ప్రవచన కార్యక్రమం

రాజాం సిటీ: స్థానిక పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ఈ నెల 21వ తేదీన భాగవత సారాంశ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో ఈఓ బీవీ మాధవరావు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి నైమిశారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సంస్థ స్థాపకులు బాలబ్రహ్మానంద సరస్వతి హాజరుకానున్నారన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే శంబంగి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే శంబంగికి బర్త్ డే విషెస్ తెలుపుతున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు వచ్చి, పుష్పగుచ్ఛాలతో బర్త్ డే విషెస్ తెలిపారు. అనంతరం జరిగిన కేక్ కటింగ్‌లో జై జగన్, జై వైఎస్సార్ సీపీ, జై శంబంగి అని అభిమానులు నినాదాలు చేయడంతో కార్యాలయంలో పండగ సందడి నెలకొంది. తొలుత నేతలు, కార్యకర్తలంతా ఎమ్మెల్యేకు కేకు తినిపించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కూడా నేతలు, కార్యకర్తలు, ఆయన అభిమానులకు కేకు తినిపించి, ఆయనలోని మంచితనం చాటుకున్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని పలుచోట్ల మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, డీఎస్పీ బి.మోహన్‌రావు, ఆర్‌డీఓ పి.శేషశైలజ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



చలివేంద్రం ప్రారంభించి, అటువైపుగా వచ్చిన వారికి మజ్జిగ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం ప్రారంభించారు. వేసవి తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే సూచించారు. రాజాంతో పాటు పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రధాన రోడ్లు, జంక్షన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రయాణికులు, పాదచారులకు తాగునీరు అందజేయాలని, స్వచ్ఛంద సంస్థలను కోరారు. అనంతరం మజ్జిగను అక్కడి కొంతమందికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, ఏఈ రత్నాకర్, టీపీఓ నాగలత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



రాజాం సిటీ: అగ్నిప్రమాదాల సమయంలో వినియోగించే దుస్తులు, పరికరాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది



బాడంగి: డొంకినవలస ఫైర్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామినాయుడు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఫైర్ ఎస్‌ఐ టీఎస్‌ఎస్ జనార్దనరావు మాట్లాడుతూ అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలుచోట్ల అగ్నిప్రమాదాలు జరగకుండా, వాటి బారినపడకుండా, ఒకవేళ ప్రమాదంలో చిక్కుకున్నా సురక్షితంగా ఎలా బయటపడాలన్న అంశంపై విస్తృత అవగాహన కల్పించామన్నారు. అనంతరం ఫైర్‌స్టేషన్ ఆవరణలో ప్రమాదాల సమయంలో వినియోగించే పరికరాలను ప్రదర్శించారు. దీనిని చూసేందుకు స్థానికులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఫైర్ ఏఎస్‌ఐ వై.గోవింద్, రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస ఫైర్‌స్టేషన్ ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ జి.రామినాయుడు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వాటర్ క్యాన్ల వితరణ



వాటర్ క్యాన్లు అందజేస్తున్న దాతలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని గ్లోబల్ వ్యూ స్కూల్‌కు చెందిన డైరెక్టర్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ చంద్రమోహన్ కలిసి రూ.10 వేల విలువైన వాటర్ క్యాన్లను గురువారం వితరణ చేశారు. వేసవి దృష్ట్యా విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

రాజాం సిటీ: వేసవికాలం దృష్ట్యా పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని జువాలజీ అధ్యాపకుడు బి.రవి అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో ఎన్.ఎస్.ఎస్ సేవా శిబిరం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ పీఓలు సీహెచ్ రవీంద్ర, టి.గోవిందరావు, పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామకపత్రాలు



వలంటీర్లకు నియామకపత్రాలు అందిస్తున్న సర్పంచ్ బాబూరావునాయుడు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామ సచివాలయం వద్ద కొత్తగా ఎంపికైన ఇద్దరు వలంటీర్లకు సర్పంచ్ గేదెల బాబూరావునాయుడు చేతులమీదుగా గురువారం నియామకపత్రాలు అందజేశారు. క్లస్టర్–18 వలంటీర్‌గా శాసపు రాంబాబు, క్లస్టర్–3 వలంటీర్‌గా రాకోటి నిర్మల నియమితులయ్యారని ఎంపీడీఓ రఘునాధాచారి తెలిపారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సకాలంలో గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రీన్‌అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు చెల్లించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న ఆయన వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో, ప్రధాన కూడళ్లలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్న పంచాయతీలకు సంబంధించి, అన్ని రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును నమోదు చేయాలని, సమీకృత అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రతీ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంచాయతీల వారీగా శతశాతం ఇంటి పన్ను వసూళ్లు, ఫీవర్ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.